
# ఏ 'క్లాస్ ఖైదీ



ఆ ఇంట్లో నుంచి బయటపడి నడిరోడ్డులో నిలబడి తలను మాత్రం తిప్పగలిగినంత వరకు వెనక్కు తిప్పి ఒక్కసారి ఆ ఇంటివైపు ఎగాదిగా చూసి తక్షణమే తలవంచి వంచిన తలెత్తకుండా అడుగుమీద అడుగ్గా నడుస్తున్నాడు వెంకటరెడ్డి. నడుస్తూ ఆలోచిస్తున్నాడు.

“తిరపతికి ఏందో పనిమీద వచ్చినానే అనుకో! వచ్చిన పని చూసుకోని తిరుగుదోవ పట్టుకోవాల్నా? పన్లేదా? పని అయిందో కాలేదో అది వేరేకత. వాడెవుడో పిల్చినాడే అనుకో. ఇంకేం పన్లేనోడి మాదిర్తో ఆ కొంపకాడికి పోవాలన్న కోరికెందుకు కలగాల? కలిగింది బో. ఆ కొంపకాడికెందుకు పోవాల? పొయ్‌నానే అనుకో. సుట్టపు సూపుగా సూసేసి వచ్చిన దోవ పట్టుకోనుండచ్చు గదా? పట్టుకోకుండా తీగె అట్టా కదిలిస్తే డొంకంతా కదిలె! దీనికంతా కారణం కోరిక. కోరిక కలిగిందే అనుకో! ఆ కోరికను అణుచుకోని ఉండచ్చు గదా?

ఆమాటకొస్తే ఆ ముందుట్నాడు గాందీరోడ్లో నడస్తాఉంటే ఎన్ని కోరికలు కలగలా? నాలుగు సెక్రాల బండ్ల మింద ద్రాచ్చి పొండ్లు గుత్తులు గుత్తులుగా అవుపిస్తా ఉంటే పండ్లు పుల్సిపోలేదా?

కొందాంచవనుకోని ఆడికి బోతే కొరివి గాలేదా? పోనీ వాటి 'పక్కనే దోరగా మాగిన ఆపిలు పొండ్లు రాసులు రాసులుగా పేర్సి పెట్టుంటే నోట్లో నీళ్ళూర్నాయా? లేదా? కోడిగుడ్డంత కాయిని వాడు ఒకేసారిగా మూడురూపాయలని కొండెక్కికూసుండే కుందికి కొందాంచవన్న కోరిక కొండెక్కి పోలేదా? ఎండలో తార్రోడ్డుమింద అరికాళ్ళు అబ్బా అమ్మను తల్సుకోమంటా ఉంటే, కాళ్ళకూ సెప్పులన్నా కొనుక్కుందాంచవని అంగిట్లోకి ఆదరాబాదరా దూర్తే వాడు జత సెప్పులు యాభైతొమ్మిది రూపాయల తొంబై అయిదు పైసలంటే అరవై అనుంటే పోలేదా? అని వాణ్ణి గిచ్చి జగడానికీడ్సి రొండని, నాలుగనిపించుకోని 'ఆ సెప్పులూ సరే! నా ఎంటికా సరే!' అనుకుంటా ముక్కులో ఎంటిక పెరికి పారేసినట్టు ఆ కోరికను గూడా ఇసిరట్టా అవతల పారెయ్‌లేదా? ఇన్ని కోరికల్ను అలాగ్గా సంపుకుణ్ణె యదవ జన్మ ఈ కోరికను గూడా అట్టానే సంపుకోనుంటే ఇప్పుడిట్లా మల్లగుల్లాలు పడాల్సిన పనే ఉండేది కాదు గదా?"

ఈ విధంగా ఆలోచిస్తూ నడుస్తున్న వెంకటరెడ్డికి తన ఆలోచనా విధానానికీ, అలనాడు దుర్యోధనుని ఆలోచనా విధానానికీ ఎక్కడో పొంతనాలున్నట్టు తోచింది. ఏటేటా ఊళ్ళో భారతోత్సవాల్లో వీధి నాటకంలో దుర్యోధనుడి పరాభవ పర్వం చవిచూస్తున్న వాడేకదా?

... ఆలోచనా విధానంలో దుర్యోధనుడికీ, తనకూ ఒక్కటే తేడా! దుర్యోధనుడు సగం సంస్కృతం, సగం తెలుగు కలగలసిన సంకర భాషలో ఆవేదన పడ్తే, తాను మాత్రం అసలు సిసలైన మాండలికంలో మధన పడ్తున్నాడు.

వెంకటరెడ్డికి నవ్వు వచ్చింది.

ఆపరిస్థితిలో నవ్వు రాకూడదు. అయినా వచ్చింది. అదే నవ్వుకున్న ప్రత్యేకత. ఒక్కొక్కప్పుడు ఎంత ప్రయత్నించినా రాని నవ్వు మరొకప్పుడు నేనున్నానంటూ వగలుపడ్తూ ముందుకు వస్తుంది. ఆ నవ్వుతో వెంకటరెడ్డి మనస్సు క్షణికంగా తేలికపడినా యథాస్థితి చేరుకోవడానికి ఎంతో కాలం పట్టలేదు.

వెంకటరెడ్డి నడుస్తున్నాడు... అడుగు మీద అడుగ్గా... ఆలోచనలు పేక పడుగ్గా!

ఆ ముందు రోజు ఊళ్ళో నుండి తిరుపతికి బయల్దేరుతూ ఉంటే తగుదునంటూ వెంకటరెడ్డి భార్య ఎదురుగా నిలబడింది. 'ఎక్కడికీ ప్రయాణం?' అన్నట్టుగా ఒక చూపు విసిరింది. ఆ మీదట "దుడ్లిచ్చి తద్దినం కొనుక్కుండే దంటే ఇట్టా మాదిర్తోనే గదా? వాడెవుడో బతక నేర్చిన యదవ. గొంతు మిందికొచ్చిందని కొంపలోకొచ్చి గుంత కూసుండె. కష్టం ఎవుడికైనా వస్తుంది. కాదన్లేదే?...

అయినా మనసేతిలో ఉంటే ఇయ్యాల. లేకుండాబోతే లేదని చెప్పాల. ఈ కొంపలో కత అట్టామాదిరి కాకండా పాయ్‌నే? వాడికంటే ముందు నువ్వే 'ఊడిపాయ. జారిపాయ. కొంపలు నిలవనా కూలిపాయ!' అంటా నంగేడుపులు ఏడిస్తివి. ఒగిటా? రొండా? అయిదువేలే? తెచ్చి వాడిదోసిట్లో పోస్తివి. బతకనేర్చినోడే. వాడుగూడా సచ్చి నీకడపన పుట్టానంటా వొంగొంగి దండాలు పెడ్తా ఎలబారిపాయ్‌నే. యదవన్నరయదవ. ఆర్నెల్లు అవతా ఉండాది. అతీ గెతీ

లేకుండాపాయ. ఇప్పుడు నువ్వు వాణ్ణి ఎతుక్కుంటా ఎలబార్నావు. సచ్చి కడపన పుట్టా నన్నె యదవ. వాడిచ్చినట్టే! నువ్వు తెచ్చుకుణ్ణిట్టే! తెచ్చినోళ్ళ కెత్తుకోనిబొయ్ ఇచ్చుకుణ్ణట్టే!"

వెంకటరెడ్డికి అరికాలి మంట ఉచ్చికెక్కింది. 'ఆడికి నిలపతావా లేదా నీపాడు దండకం'? అన్నెట్టుగా ఒక్క చూపు చూశాడు.

"ఈ కాలాన కలిగిన మాటంటే కంట్లో పుల్లపెట్నెట్టంట.. ఆ మాటన్నేల? దానికి రొండు రానేల? కానీ ఎగబెట్టుకోని ఎట్టా తిరపతికి పొయ్యేదేఁవో పోతా ఉండావు. పోతే పోతా ఉండావు గానీ నువ్వేందో నీపనేందో చూసుకోని ఎంబడే తిరుక్కో. తలెత్తి అట్ట జూడు ఆ గొడ్డుకల్లా. నువ్వు తిరుక్కోనొచ్చేదాకా అదట్టా కట్టుగూటానబడి అగోరించాల్సిందే కదా? పోనీలే పాపం! కట్టుగూటానబడి వొగిరిస్తా ఉండాది గదా! కుడితైనా సూపదాఁవని ఎవుడైనా దగ్గరికి పోతే సాలు. పొగురుబోతు గుఱ్ఱం మాదిర్తో ముందిరి కాళ్ళు రొండూ పైకెత్తి మోర కిస్తింది. అది సరే! నేనుచెప్తా ఉండేదేఁవన్నా సెవల్లో పడ్తా ఉండాదా లేదా?"

"నువ్వాడికి నోరుమూస్తావా లేదా?" గొంతు చించుకొన్నట్లుగా అరిచాడు వెంకటరెడ్డి. ఆ అరుపుతో అదిరిపడింది ఆ ఇల్లాలు. అంతలోనే తేరుకుని "ఈ కొంప రతికెక్కేటట్టుగా ఉంటే ఆకతే ఇంకొక మాదిర్తో ఉండేది. పోనీలే! నే నొకదాన్నేనా పోతా పోతా మూటగట్టుకొని నెత్తిన బెట్టుకొని పోబొయ్యేది. నాడెట్టా రాసుంటే అట్నే తెల్లారబోతింది" అని సణుక్కుంటూ ఆ ఇల్లాలు ఇంట్లోకి వెళ్ళింది.

ఇల్లాలిమాటల్లో వాస్తవముంది. మరి తన చేతల్లో?– అదే ఆలోచించుకొంటూ వెంకటరెడ్డి ఊరు ముందర బస్సు ఎక్కాడు. బస్సు కిటకిటలాడుతూ జనం. కూర్చోవడానికి కాదు. కనీసం నిలబడడానికి కూడా ఒంటికాలినే ఆశ్రయించవలసినంత జనం. ఆ జనం మధ్య ఇరుక్కున్నాడు వెంకటరెడ్డి.

'ఇలా ప్రయాణం చేయడం మీకు తప్పదు. మిమ్మల్ని మోసేగతి నాకూ తప్పదు. మీ తిప్పలు మీవి. నా తిప్పలు నావి.' అన్నట్లుగా బస్సు మోకాటిలోతు గుంతల్లో పడుతూ లేస్తూ పోతూ ఉంది.

"స్వాతంత్ర్యం వచ్చి నలభై ఏండ్లయింది. 'ఈ నలభై ఏండ్లలో పొడిచేసినాం. గెలిచేసినాం' అంటా అందరూ బల్లలు గుద్ది మాట్లేడే మొనగాళ్ళే! రమ్మనండి. ఈ రోడ్డును చూసి మళ్ళీ మాట్లాడమనండి చూస్తాం."

"రోడ్లు ఎట్లుంటే ఎవుడికి కాపట్టింది. బస్సులెట్టుంటే ఏఁవి? గవర్నమెంటోళ్ళకు కావాల్సింది చార్జీలు. మూడు మూన్నాళ్ళకు వాళ్ళు పెంచేస్తానే ఉంటారు. మనం నోరు మూసుకోని అడిగినంత ఇచ్చేస్తా ఉండాం. వాళ్ళట్నే. మన విఁట్నే. మాట్లెందుగ్గానీ పద పదండయ్యా సాలు గానీ!"

"మనఁవంతా ఒక మాట మింద ఒక తాటిమింద నిలబడుకోవాల. అరునూరైనా నూరు ఆరైనా ఈ బాటమింద వొచ్చేపొయ్యే బస్సుల్ను అట్టాయిట్టా కదలకుండా నిలబెట్టాల?"

"మజ్జిక్కి దోవలే. ఆ దెవుడో పెరుగు కోసరం సీటీ రాసిపంపించినాడంట. అట్టుండాది మన యవ్వారం. మనఁవా ఒక తాటి మింద నిలబడేది? హ్హెహ్హెహ్హె!"

పడుతూ లేస్తూ ముందుకు పోతున్న బస్సులో ఇరుక్కొన్న ప్రజానీకం వాదోపవాదాల్లో పడుతూ లేస్తున్నారు.

పిప్పళ్ళ బస్తాలు కూరినట్లున్న జనం కానీ వాళ్ళవాదోపవాదాలు కానీ వెంకటరెడ్డి చెవిని పడలేదు. అతని కంటిముందు తనఇల్లాలు. చెవుల్లో ఆమె మాటలు!

"సీ సీ! ఈ ఆడోళ్ళంతా ఇంతేనేఁవో? అప్పిటికి ఈళ్ళకే బొరువూ బాద్దెతలుణ్ణెట్టు. తక్కినోళ్ళకెవురికీ లేనట్టు. ఎదిటోడు గూడా మణిసే గదా? వాడు తినేది గూడా కూడే గదా! కూడుదినే ఏ యదవకైనా అమాత్రం బుద్దీగ్నానం ఉండదా? అప్పిటికి ఆడదానికి తెల్సినంత మొగోడికి తెల్దనిగదా దీనికర్తం!

అయినా అది నిన్న గాక మొన్నొచ్చిన గొంగిడి. వాడట్లా కాకపాయ్‌నే! ఈది బళ్ళో ఓనమాలు రుద్దుకుణ్ణెప్పుణ్ణుంచి అయిదో తరగద్దాకా అయిదేండ్లు పక్కపక్కనే కూసోని గదా సదువుకుణ్ణింది. ఇంక ఆటిడుపొస్తే చూడు. ఒక ఆటా? ఒక పాటా? పరవగుట్టమింద పరిగిపొండ్లు కోసిందీ మేఁవే! గూటంకొండ కుప్పమింద కుప్పిగంతులేసిందీ మేఁవే! ఒక కంచం, ఒక మంచంగా బతికినోళ్ళం. ఎల్లకాలం అట్టా మాదిర్నే బతికే దానికవితిందా? వాడు బొయ్ నిమ్మళిగా తిరపతిలో చేరుకుండె. వాడి బతకు వాడిదిగా ఉంటే కయ్యా గాలవ సూసుకుంటా నా బతుకేమో నాదిగా ఉండాది. అటుమంటోడు రొండు సేతులూ పట్టుకోని కండ్ల నీళ్ళు బెట్టుకుంటే- అప్పిటికి నేను బతికినట్టా? సచ్చినట్టా? ఈ బాద నాయింట్లోదాని కేం దెల్సు? దానికి తెల్సిందంతా అయిదు వేలే? అయిదువేలు ఆ దెవుడో దోవన బొయ్యే యదవ యదానేస్తివే అని! ఆడబుద్ధి! అంతకుమించి ఆలోచించగలిగితిందా?

అక్కర! అది ఎవుడికైనా వొస్తింది. అక్కరకని దుడ్లు చేబొదులుగా తీసుకున్నోడు ఇస్తాడు. ఈకుండా యాడికి బోతాడు? లేదంటే ఈ పొద్దనింది రేపు. రే పనింది ఎల్లుండి. ఈ మాత్రానికే ఓర్సుకోలేకుండా బోతే ఎట్టబ్బా? కష్టాలు మణుసులకు రాకుండా మాకులకా వస్తాయి?

అయినా ఉండారు ఈ ఎగవింటోళ్ళు వాళ్ళుండారే? సుద్ద పనికిమాల్నె యదవలు. అటుమంటి యదవలు ఈ బూ ప్రెపంచంలో ఎతికినా దొరకరు. దుడ్లేంది? పాపిష్టి దుడ్లు. ఈ పొద్దు నీ తావన. రేవు ఇంగొకడి తావన. స్తిరంగా చీల్లు కొట్టుకోని ఒక్కడి తావన్నే ఉండిపోయ్యేటట్టుగా ఉంటే? లేకుండాబోతే పోతాపోతా ఎత్తి నెత్తిన బెట్టుకోని పొయ్యేటట్టుగా ఉంటే? ఆహాహా! ఇంకేఁవన్నా ఉండాదా? ఈ యదవలంతా తలకాయి దమ్మిడి కడగరా?

అదేఁవి అరుసోద్దిఁవో? ఈ దుడ్లుకూడా సేరేవాళ్ళ తావన్నే సేర్తా ఉంటాయి. ఆ ఎగవింటోళ్ళ ఇంట్లో ఇనప్పెట్లో మూలగతా ఉండాయి దుడ్లు. అట్టని ఎవుడికంటే వాడికి జవిరి జవిరి ఎత్తిచ్చియ్యమన్లేదే! నూటికి రొంద్రూపాయల వడ్డీ. వడ్డీ మొదులు అష్టాబాపత్తుగా

ముక్కు పిండి వసూల్జేసుకుంటా ఉండారుగదా? సరే! వడ్డీకైనా అక్కరకు వొదగల్ల గదా? వొదిగినారబ్బా. కాదన్లేదే? అట్లని 'ఇస్తావా? సస్తావా?' అని గొంతల మింద కూసుంటే?

అయినా ఏం మణుసులో ఈ మణుసులు? అంతా గడ్సి బతకతా ఉండాలనుకుంటారు. ఈ లోకంలో ఎవుడికి గడ్సింది? వాసుదేవు డంతటోడికే గాడ్ది కాళ్ళు పట్టేది తప్పలా! ఈ మాత్రం గ్రెహిస్తే ఇంకేలవుండాది? దర్మం నాలుగు పాదాల మింద నడవదా?"

ధర్మం! నాలుగు పాదాల మీద నడిచేది ఏమోకానీ ఒక్క పాదం మీద నిలబడిన వెంకటరెడ్డి ఆ పాదాన్ని మార్చి మార్చి నిలబడి ఆలోచిస్తున్నాడు.

బస్సు బొట్లవారి పల్లె దాటింది. పచ్చికపల్లం దగ్గర మలుపు తిరిగి తిరుపతి దారి పట్టింది.

పచ్చికపల్లం దగ్గర బస్సు కాసంత పలచబడింది. వెంకటరెడ్డి ఒంటి కాలి తపస్సుకు భంగం కలిగింది. నింపాదిగా కూర్చున్నాడు. నిలబడి నిలబడి కాళ్ళు తీపులు తీస్తున్నాయి. ఆలోచించి ఆలోచించి మనస్సు అలిసిపోయింది. తారురోడ్డు మీద బస్సు కష్టాల సుడిగుండాల్లో నుంచి బయటపడిన పూల తెప్పలా తేలిపోతూ ఉంది. వెంకటరెడ్డికి మాగన్ను పడింది.

తిరుపతిలో రాయల్‌చెరువు బస్‌స్టాండ్‌లో వెంకటరెడ్డి బస్సు దిగేసరికి పొద్దు నడిమిట్టన ఉంది. నడిమిట్టన మండేవాడు కాల ప్రభావానికి తలవంచక నులివెచ్చని కాపడం వేస్తున్నాడు. ఆ హాయిని అనుభవిస్తున్న జనం వెన్నెల్లో ఆడుకుంటున్న అనుభూతిని అనుభవిస్తున్నారు.

వాళ్ళల్లో ఒకడు వెంకటరెడ్డి. తన చిన్ననాటి చెలికాడు పాండురంగం ఇంటి దారిపట్టి నడుస్తున్నాడు.

రాయల్‌చెరువు బస్‌స్టాండ్ దగ్గర రైల్వేగేట్. పాకాల వైపు వెళ్ళే రైలు అప్పుడే ఎగబడిపోయినట్లుంది. గేట్ తలుపులు తీశారు. గేటుకు ఇరువైపులా కట్టలు గట్టి నిలబడిన జనం ఒక్కసారిగా కదిలారు. తొందర. ఒకరికి మించి ఇంకొకరికి. అందరికీ తొందరే. ఆ తొందర్లో సైకిళ్ళు రిక్షాలు ఆటోలు స్కూటర్లు నువ్వు ముందా? నేను ముందా? అని పోటీలు పడుతున్నాయి. ఆ పోటీలో ఒకదాన్నొకటి ఢీకొంటున్నాయి. స్వారి చేస్తున్న వీరులు బూతుల బాణాలు విసురుకొంటున్నారు.

వెంకటరెడ్డి బాట పక్కన నిలబడ్డాడు. నిలబడి తమాషా చూస్తున్నాడు. చూస్తూ ఆలోచిస్తున్నాడు.

"ఈళ్ళ కెందుకీ తొందర? యాడ కొంపలు మునిగిపోతా ఉండాయో? ఇట్టా మాదిర తొందరపడేదెందుకు? తొందర్లో పట్టుదప్పే దెందుకు? ఢీ కొట్టుకుండేదెందుకు? ఆడికి సాల్దన్నెట్టుగా తిట్టుకుండేదెందుకు? అంటే– మణిసి చేతిలో– కాదుకాలం. కాలంచేతిలో మణిసి బానిస!"

నిజంగా వాళ్ళ మీద చాలా జాలి కలిగింది వెంకటరెడ్డికి! "ఏం మణుసులో పాడు మణుసులు!' అనుకొంటూ ముందుకు నడుస్తున్నాడు.

రైల్వే గేట్‌కూ, కర్నాల వీధికీ మధ్య సన్న సందు. ఆ సందు ఒక మినీ మార్కెట్. అక్కడ ఎప్పుడూ సంత జరుగుతున్నట్టు సందడి. ఆ సంతను దాటుకొన్నాడు. కర్నాల వీధిలో అడుగుపెట్టాడు.

ఒకప్పుడు కర్నాల వీధి– ఇప్పుడు నేతాజీ రోడ్!

నేతాజీ రోడ్‌లో ఆవేళప్పుడు ఒకలారీ నట్ట నడిరోడ్డులో దర్జాగా నిలబడింది. ఆ లారీల నుంచి కూలీలు సిమెంటు బస్తాలు దింపుతున్నారు. అసలే నేతాజీ రోడ్ వెడల్పు అంతంత మాత్రం. ఆ అంతలో కొంత అన్నట్లుగా లారీ సగం రోడ్‌ను ఆక్రమించుకొనింది. అందువల్ల అక్కడ రాకపోకలకు అంతరాయం కలిగింది.

లారీ ఆక్రమించుకోగా మిగిలిన సగం రోడ్డులో వచ్చే వాళ్ళు రావాలనీ, పోయే వాళ్ళు పోవాలని ఇరుపక్షాలు ఇనుమిక్కులుగా ప్రయత్నిస్తూంటే వచ్చేవాళ్ళు రాలేరు. పోయే వాళ్ళు పోలేరు. ఎక్కడి వాళ్ళక్కడనే గప్‌చిప్!

వెంకటరెడ్డి కూడా గప్‌చిప్ మని బాటపక్కనే నిలబడ్డాడు.

అంతలోనే అక్కడొక రక్షకభటుడు ప్రత్యక్షమయ్యాడు. ప్రజలు పడుతున్న ఇబ్బందిని గమనించాడు. జాలి పడ్డాడు. లారీ కర్రతో రంగ ప్రవేశం చేశాడు. "ఎవరిదీ లారీ? ఎక్కడ డ్రైవర్?" అంటూ లారీ కర్రతో లారీని బాదాడు.

ఆ పక్కన్నే తిన్నెమీద నింపాదిగా కూర్చొని బీడీ కాల్చుకొంటున్న డ్రైవర్ ఎగిరిపడి లేచాడు. చేతిలోని బీడీ తుంటను పోలీసు గౌరవార్థంగా విసిరి అవతల పారేశాడు. గబగబ వచ్చి రక్షకభటుని ముందు నిలబడ్డాడు. లాఠీకర్ర శబ్దాన్ని అర్థం చేసుకొన్నట్టుగా ఒక సెల్యూట్ కొట్టాడు. కొట్టిన చేతిని జేబులోకి పోనిచ్చాడు.

పరులకంట పడకుండా పదిరూపాయల కాగితం స్థానభ్రంశం చెందింది.

"ట్రాఫిక్ జాం అవతా ఉండాదే. కండ్లుదొబ్బిందా! తొందర తొందరగా కానీయండి మరి?" అంటూ సైకిలెక్కాడు– నేతాజీ రోడ్డులో నేతాజీకి వారసుడు వాడు!

'ప్రజా సేవయే మా కర్తవ్యం' అన్న బోర్డును వీపున కట్టుకొన్న ఎర్ర బస్సు ఎగిరిపడి నవ్వుకుంటూ వెళ్ళిపోయింది.

'పాపిష్టి దుడ్లు ఎంత పనికైనా వగ తెగిస్తాయి!, ఏ మాటైనా అనిపిస్తాయి!' అని ఇల్లాల్ని తల్చుకొంటూ వెంకటరెడ్డి ముందుకు కదిలాడు.

వెంకటరెడ్డి పాండురంగం ఇల్లు చేరుకొనే సరికి పాండురంగం ఇంట్లో లేడు. లేకపోతే మాత్రం ఏం? ఆ ఇంటి ఇల్లాలు ఎంతో మర్యాద చేసింది. ఇంటిలోకి అడుగు పెట్టానే కాళ్ళూ, చేతులూ కడుక్కోవడానికి నీళ్ళు తెచ్చి ఇచ్చింది. కమ్మని భోజనం పెట్టింది. 'భార్య పిల్లలు క్షేమమే గదా?' అని కుశల ప్రశ్నలు కుమ్మరించింది. తాను చేసిన సహాయానికి తమ చర్మాన్ని చెప్పులు కుట్టిచ్చినా ఋణంతీరదని తెగబాధపడింది.

వెంకటరెడ్డి కడుపు నిండిపోయింది. ఏం మాట్లాడాలో తోచకుండా తలవంచుకొని కూర్చున్నాడు.

"అన్నయ్యా! మీరు నిజం చెప్పినా వింటారు. అపద్ధం చెప్పినా వింటారు. ఎప్పుడో ఏదో బ్యాంకీలో చేసిన అప్పుకు అరెస్ట్ వారెంట్ వచ్చింది. నేను కుప్పగా కూలిపోయాను. ఆయనకైతే నడుంవులే విరిగాయి. ఆ సమయంలో మీరు ఆదుకొన్నారు. ఇప్పుడు ఆయన అదే పనిమీద తిరగతా ఉండాడు. వీలైనంత తొందర్లో డబ్బు జమచేసి పువ్వుల్లో బెట్టియ్యాలని ఆయన పడ్తాఉండే తపన ఈ నోటితో చెప్పలేనన్నయ్యా!"

వెంకటరెడ్డి పైకి లేచాడు.

"అయ్యయ్యో! అదేందన్నయ్యా? కాలికి చెప్పులు తొడుక్కోని వచ్చినట్లున్నారే? రాక రాక వచ్చారు. ఒక పూటన్నా ఉండండి. ఎంత పొద్దుపొయ్‌నా ఆయన రాత్రికి ఇల్లు చేరుకుంటాడు. ఒకమాట ఆయనతో కూడా మాట్లాడిపోతే మంచిది గదన్నయ్యా!"

"లేదు లేమ్మా! ఇంటి దగ్గర పన్లు సెప్పేదానికి మాలదు. ఒక పూట కొంపకాడ లేకుండా బోతే గొడ్లకు నీళ్ళు జూపే దిక్కుగూడా లేదు. వాడొస్తే ఒకమాట సెప్పమ్మా. దుడ్లు దెచ్చిన సోట శానాబదనాయంగా ఉండాది."

"ఆమాట మీరు చెప్పాల్నా అన్నయ్యా? నేను ముందుగానే చెప్తిని గదా? వేళకు తిండీ తిప్పలు గూడా లేకుండా తిరగతా ఉండారు. చేతికొస్తానే రెక్కలు గట్టుకోనొచ్చి వాల్తాడులే! మీరేవీ దిగులు పడబాకండి."

ఆ క్షణంలో ఇంత మంచి మనుషుల్ని అపార్థం చేసుకొన్న తన భార్య మీద చాలా కోపం వచ్చింది వెంకటరెడ్డికి. అయినా కోపాన్ని బయటపడనీయకుండా తానే బయటపడ్డాడు. ఆ ఇంట్లోనుంచి.

"ఇప్పుడేం జెయ్యాల?"

వెంకటరెడ్డి గాంధీ రోడ్డు మీద నడుస్తూ ఆలోచిస్తున్నాడు.

"ఇప్పుడేం జెయ్యాలంటే!... కొంప జేరుకోవాల!"

"కొంపజేరుకుంటే ఎగవింటోడు ఎగబెట్టుకోనొస్తాడు."

"వొచ్చి 'ఇస్తావా? సస్తావా?' అని నిల్దీస్తాడు."

"నిల్దీస్తే వాడికెట్టా జెప్తే వినబోతాడబ్బా?"

పరధ్యానంగా నడుస్తున్న వెంకటరెడ్డి పైన పడుతుందేమో అనిపించిన జీప్ పక్కన ఆగింది. 'తన పక్కనే జీపెందుకు నిలబడిందబ్బా?' అనుకొంటూ వెంకటరెడ్డి తలపైకెత్తి చూశాడు. జీప్‌లో భాస్కర్.

భాస్కర్ పోలీస్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్.

భాస్కర్ తన ఊరి వాడే. తన ఈడు వాడే. తనతో కూడా కలిసి చదువుకొన్నవాడే. అయితే తనకూ, పాండురంగానికున్నంత అనుబంధం భాస్కర్‌తో లేదు. అయినా అనుకోకుండా ఆస్థితిలో కంటపడేసరికి వెంకటరెడ్డి మొగంలో తంగేళ్ళు పూశాయి. నోట మాట రాకుండా తదేకంగా భాస్కర్ వైపే చూస్తున్నాడు.

"ఏవిట్రా ఆ చూపులు? హ్హాహ్హాహ్హా! అది సరే కానీ ఇది రోడ్డనుకున్నావా? లేదు. నీ కయ్యిలో గనిమలనుకొన్నావా? అంత పరధ్యానంగా నడుస్తూంటే- ఏకారో మోటారోవచ్చి పైన పడ్డే కూడా గమనించేటట్టు లేవే? ఏం కథ!"

భాస్కర్ అడుగుతున్నాడు.

వెంకటరెడ్డి భాస్కర్ తల్లిని గురించి ఆలోచిస్తున్నాడు.

"భాస్కర్ తల్లి విమలమ్మ. ఎంత మంచి మణిసో? ఆంవె సేతికి ఎంవికే లేదు. ఎప్పుడు పొయ్‌నా సరే! తినే దానికి ఏదో వొగిటి పెట్టకుండా ఇడ్సిపెట్టేది గాదు. ఆ మహాతల్లిని సూసి ఎన్ని దినాలైపాయ? యాడుండాదో! ఎట్టుండాదో?"

"ఏంవిరా? అడిగేదెవర్ని? సమాధానం చెప్తావా? ఎత్తి జీపులో వేసుకోమంటావా?" పోలీస్ జులుం పరాచికాలాడుతూ ఉంది.

"అది సరే గానీ భాస్కరా! అమ్మ యాడుండాదిరా?!

"ఎక్కడో ఎందుంకుంటుంది? నాదగ్గరే ఉంది."

"అయితే ఒకసారి చూడాలని ఉందిరా!"

"ఒక్కసారే ఎందుకు? ఒక్క దినమంతా కూర్చొని చూడు. ఎక్కు జీప్ పోదాం!"

వెంకటరెడ్డి జీప్ ఎక్కాడు. జీప్ కదిలింది. అసలే జీప్. అందులో పోలీస్ జీప్. అడ్డం ఆపూ ఉంటుందా? ఎదురుగా వచ్చిన వాళ్ళు తొలగవలసిందే. వద్దనుకుంటే దాని కిందపడి ఆత్మార్పణ చేసుకోవలసిందే. శరవేగంతో దూసుకుంటూ వచ్చి పదిహేను నిముషాల్లో భాస్కర్ ఇంటి ముందు ఆగింది.

"దిగరా వెంకటరెడ్డీ దిగు. దిగి అమ్మతో మాట్లాడుతూ ఉండు. నాకు కొన్ని అవసరమైన పనులున్నాయి. చూసుకొని వెంటనే వచ్చేస్తా. నేను వచ్చేదాకా ఉండు. ఉడాయించేస్తివో పోలీసోడితో పొత్తని మరిచిపోవద్దు!"

జీప్ ముందుకు కదిలింది.

వెంకటరెడ్డి ఇంటి లోపలికి నడిచాడు.

ఇల్లు అధునాతన రీతుల్లో చాలా అందంగా ఉంది. ఇంటి చుట్టూ ప్రహరీ గోడ. ఇంటి ముందర పూలతోట. ఇంటిచుట్టూ రకరకాల ఫలజాతుల చెట్లు!

ఇంటి ముఖద్వారాన్ని దాటి... ఇంటి చుట్టూ గమనిస్తూ... జంకుతూ జంకుతూ నడుస్తున్న వెంకటరెడ్డి ఆ ఇంట్లోని బొచ్చు కుక్క కంట్లో పడ్డాడు. దాని రంపు అంతా ఇంతా కాదు. తలుపులు మూసి ఉండకపోతే ఏకంగా పైనబడి పీకుతుందేమో అన్నట్లుంది దాని ఆర్భాటం.

"కుక్కలున్నాయి. జాగ్రత్త!" అని బోర్డు పెట్టనందుకు వెంకటరెడ్డికి భాస్కర్ మీద చాలా కోపం వచ్చింది. అయినా ముందుకు పోలేక వెనక్కు రాలేక తటపటాయిస్తున్నాడు.

అంతలో ఒక నడివయసు స్త్రీ. నాజూగ్గా ఉంది. ఠీవిగా వచ్చింది.

"ఏయ్ జానీ కీప్ క్వయిట్! కీప్ క్వయిట్!" అనింది.

ఆ మందలింపులో కూడా ఎంతో ఆప్యాయత తొణికిస లాడుతూ ఉంది.

ఆ మాటతో కూడా కుక్క అరవడం మానుకొనింది. తోకాడిస్తూ ఆ ఇల్లాలి చీర కుచ్చెళ్ళు లాగుతూ ఉంది.

ఆ క్షణంలో కుక్కకు కూడా తన భాష ఒంటబట్టించిన తెల్లోడి మీద వెంకటరెడ్డికి చాలా కోపం వచ్చింది. ఇంగ్లీషు నేర్చుకున్న కుక్క మీద వల్లమాలిన అభిమానం కలిగింది. ఆ కుక్కవైపు వింతగా చూస్తున్నాడు వెంకటరెడ్డి.

"ఎవరు కావాలండీ?"

కుక్కకు చిగులుకొన్న వెంకటరెడ్డి చూపులు తటాలున అడుగుతున్న ఆమె వైపు మళ్ళాయి. ఆమె కూడా 'మిమ్మల్నే అడిగేది!' అన్నట్లుగా అసహనంగా చూస్తూ ఉంది.

"విమలమ్మగారి కోసరం" అంటూ నసిగాడు వెంకటరెడ్డి.

"ఆ గదిలో ఉన్నారు చూడండి!" అంటూ ఆమె గిరక్కున వెనక్కు తిరిగింది. ఆమె ముందు జానీ వెనకగా విసవిస లోనికి వెళ్ళారు.

ఇంటి ముందర తాళవారం. ఆ తాళవారానికి ఎడమవైపు గది. ఆ గది ముందర పరదా. చాలా సరదాగా ఉంది. ఆ పరదాను తొలగించుకొని లోపల అడుగు పెట్టాడు వెంకటరెడ్డి.

గది లాచా శుభ్రంగా ఉంది. ఆ గదిలో ఒక మంచం. మంచానికి ఎదురుగా. చిన్న మేజా. ఆ మేజా మీద ఒక స్టీల్ తట్టా లోటా. మంచానికి పక్కనే ఒక స్టూల్. ఆ స్టూల్మీద ఒక కూజా. ఆ కూజామీద బోర్లించిన ఒక లోటా. గాలీ వెలుతురు ధారాళంగా రావడానికి గోడలకు కిటికీలు పైన పంకా....

ఆ మంచం మీద కలమాగి పండిన పండు విమలమ్మ! వెల్లకిలా పడుకొని తదేకంగా పంకాను పరిశీలిస్తున్నట్టుంది.

"అమ్మా!" వెంకటరెడ్డి పిలిచాడు.

వయసు మళ్ళిన ఆతల్లికిమల్లే మంచానికి కూడా వయసు పైబడినట్లుంది. అది కిరకిర శబ్దంచేసింది. 'ఎవరయ్యా?' అంటూ ఆమె మెల్లగా లేచి కూర్చొనింది.

'నేను వెంకటరెడ్డి నమ్మా!'

ఆ మాట చెవిని పడేసరికి ఆ పండిన ముఖంలోని ముడతల్లో ముసురుకొన్న చీకట్లపైన వెలుతురు దండయాత్ర చేసింది. ఆ ముఖం కాంతివంతమైంది.

"ఎంగట్రెడ్డా? బాగుండావా అబ్బోడా? ఎన్నాళ్ళ కెన్నాళ్ళకురా? పెండ్లాం పిలకాయలు బాగుండారా? అదేందిరా నాయనా అప్పుడే తలకాయి ముగ్గుబుట్ట మాదిరైపొయ్యింది. అవున్లే. అరవై పై బడుండ్లా? ఎప్పుడొస్తివి అబ్బోడా? ఊళ్ళో అందురు బాగుండారు కదా?" గుక్క తిప్పుకోకుండా విమలమ్మ ప్రశ్నల వర్షం కురిపించింది.

"ఈడ కొంచిం పనుంటే ఆ పనిమీద మద్దేణం అనంగావస్తినమ్మా! పని గాలా. తిరుక్కోని పోతాఉంటే దోవలో అనుకోకుండా మన భాస్కరు దెదురు పడె. నువ్విక్కణ్ణే ఉండేదని వాడు చెప్తే వొస్తిని. సూడాలని శానా దినాలుగా మునాసపడ్తా ఉంటే ఆ కోరిక ఈ పొద్దిటికి తీరె. నువ్వెట్టుండా వమ్మా?"

"చూస్తా ఉండావ్ గద నాయినా? నాకేం తక్కవ. ఇద్దో ఈడ కూజా ఉండాది. కూజాలో సల్లంగా నీళ్ళుండాయి. తాగాలనుకుణ్ణప్పుడు తాగచ్చు. అద్దో ఆడ జూడు కంచం. యాళేళకు అంత అన్నం నద్సుకోనొస్తింది. పిలిస్తే పలికే దానికి జవాన్లుండారు. ఆ జవాన్లు పిలిస్తే పరిగిత్తా వచ్చే డాక్టర్లుండారు. నాకేం తక్కవరా ఎంగట్రెడ్డీ! ఏం తక్కవ లే!"

ఏమీ తక్కువ లేదంటున్నా ఏదో తక్కువగా ఉన్నట్లే ఆమె మాటల్లో ధ్వనిస్తూ ఉంది. అయితే అదేమో వెంకటరెడ్డికి అంతు దొరకలేదు. అదే ఆలోచిస్తూ ఆమెవైపు చూస్తున్నాడు.

అంతలోనే బొచ్చుకుక్క అక్కడికి పరిగెత్తుకుంటూ వచ్చింది. విమలమ్మను ఒకచూపు చూసింది. చెవులు కొట్టుకుంటూ తల అడ్డంగా ఆడించింది. ఎలా వచ్చిందో అలానే బయటికి పరిగెత్తింది.

ఆ కుక్క వెళ్ళిన వైపే చూస్తూ విమలమ్మ ఒకమహావేదాంతిలా నవ్వింది.

ఆ నవ్వులో ఆంతర్యం వెంకటరెడ్డికి బోధపడలేదు. కన్నార్పకుండా ఆమె వైపే చూస్తున్నాడు. "ఆ కుక్కను చూస్తివి గదబ్బోడా?! ఆ కుక్క గ్గూడ ఒక జవాను ఉండాడు. దానికి రొండు పూట్లా స్తానం చెయ్‌పిస్తాడు. మూడు పూట్లా పాలు తాగిస్తాడు. 'కుంయ్ కంయ్' అనిందా బిస్తత్తులు తినిపిస్తాడు. జబ్బు గిబ్బు ఏందైనా వొస్తే డాక్టర్లు పరిగెత్తుకోనొస్తారు."

ఆమె ఒక రకంగా చూస్తూ ఇంకొక రకంగా నవ్వుతూ ఉంది.

ఆ చూపు... ఆ నవ్వు... ఎక్కడో వెదికి వెదికి ఆయువు పట్టును పట్టుకొంటే వెంకటరెడ్డి గిలగిల లాడిపోతున్నాడు.

కాలం గడుస్తూ ఉంది. ఇద్దరి మధ్య మాటలు కరువయ్యాయి. గదిలో నిశ్శబ్దం.

అలా ఎంతసేపు గడిచిందో తెలియదు.

వెంకటరెడ్డి పైకి లేచాడు. ఆమెను చూస్తూ భారంగా ఒక నిట్టూర్పు విడిచాడు. మెల్లగా గది బయటికి నడిచాడు.

గది ముందు నిలబడిన వెంకటరెడ్డి ఒక్కసారి ఇంట్లోకి తొంగిచూశాడు.

భాస్కర్ అప్పుడే వచ్చినట్లుంది. ఖాకీదుస్తులు విడిచి పెట్టి లుంగీలో దూరుతున్నాడు. భార్య ఎదురుగా నిలబడి ఖాకీ దుస్తులు అందుకొంటూ ఉంది. బొచ్చుకుక్క వాడి పైకి పాకి ఎగబడుతూ ఉంది. వాడా కుక్కను ఎత్తుకొన్నాడు. కుర్చీలో కూర్చున్నాడు. 'ఏరా జానీ! పాలు తాగావా? బిస్కట్లు తిన్నావా?' అంటూ బొచ్చు కుక్కతో ముదిగారాలు పోతున్నాడు. అది వాడి మూతి నాకడానికి ముంపుతూ ఉంది.

చిన్నప్పుడు తల్లి ఒడిలో భాస్కర్ గుర్తుకొచ్చాడు వెంకటరెడ్డికి.

వెంకటరెడ్డి తలవాలి పోయింది. పిల్లి మాదిర ఆ ఇంట్లో నుంచి బయటపడ్డాడు. నడిరోడ్డులో నిలబడ్డాడు. తలను వెనక్కు తిప్పగలిగినంతవరకు తిప్పాడు. ఒక్కసారి ఆ ఇంటివైపు ఎగాదిగా చూశాడు. తక్షణమే తలవంచాడు. వంచిన తలెత్తకుండా నడుస్తున్నాడు. నడుస్తూ ఆలోచిస్తున్నాడు.

"నా దగ్గిర దుడ్లు లేవు. అయినా పాండురంగం వొచ్చి సేతులు పట్టుకుంటే నేను పొయ్ ఇంకొకడి కాళ్ళు సేతులు పట్టుకుంటి. కారణం? ఆత్మీయత!.

ఇచ్చిన దుడ్లు అడగదాం వని అదేపనిగా వొస్తి. అడగలేకుండా పోతి. కారణం? ఆ ఇల్లాలు సూపించిన ఆత్మీయత!

ఇంటికాడ ఇబ్బందులుండాయే మూడుమూసి అరుఅతికినట్టుంటే విమలమ్మ దగ్గిరికి నడిపించింది!.... ఆత్మీయత!

ఆ ఆత్మీయతే కరువైతే?

ఆ క్షణంలో కుక్క బతుకు కుక్క చావు అన్న పదాలకు అర్థమే తారుమారైనట్లు తోచింది వెంకటరెడ్డికి. ఒక కుక్కకు దొరికిన ఆత్మీయత మనసున్న ఒక మనిషికి కరువైనప్పుడు ఎన్ని సుఖాలుంటే మాత్రం ఏం ప్రయోజనం?– అసంతృప్తికి ఆనవాలుగా మిగిలిన విమలమ్మ మౌనంగా భరిస్తున్న ఆవేదన తనకండ్లల్లో కరిగితే వెంకటరెడ్డి నిలబడ్డాడు.

కండ్లు వత్తుకొన్నాడు.

తల వెనక్కు తిప్పగలిగినంతవరకు తిప్పి... ఒక్కసారి ఆ ఇంటివైపు తిరిగిచూసి... 'పోరా భాస్కరా'! అని నాలుక చివరి దాకావస్తే అది 'పోరా కుక్కా!' అని తిరగబడింది! ●

ఆంధ్రప్రభ
(28, ఫిబ్రవరి 1990)